పాతనగరం.. పాట్లు

జీవీఎంసీ, పోర్టుట్రస్ట్ తీరుతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఒకప్పుడు విశాఖపట్నంలో ఓ ముఖ్యమైన ప్రాంతం పాతనగరం. అయితే కాలక్రమేణా నగరం విస్తరించడంతో పాతనగరం పాతబడిపోయింది. అధికారులు కూడా శీతకన్ను వేయడంతో సమస్యలతో పాటు అభివృద్ధికి కూడా ఈ ప్రాంతం దూరమైపోయింది.

- భారీ వాహనాల రాకపోకలతో శిథిలమవుతున్న ఇళ్లు
- కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్న స్థానికులు



పోర్టు ఉపయోగించుకుంటున్న జీవీఎంసీ రహదారిపై సాగిపోతున్న భారీ కంటైనర్



భారీ వాహనాల రాకపోకలతో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు పాతనగరం అంటే ఇప్పుడు నగర శివారు ప్రాంతం. ఒకప్పుడు నగరం మొదట్లో ఉండే ఈ ప్రాంతం ఇక్కడి రహదారి సమస్యతో సతమతమవుతోంది. పోర్టు కంటైనర్ టెర్మినల్ దగ్గరున్న ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది నివసిస్తున్నారు. దీనికి ఆనుకుని జీవీఎంసీ రహదారి ఉంది. గతంలో విశాఖ పోర్టు ట్రస్ట్ ఈ రహదారిని డెవలప్ చేస్తానని చెప్పి జీవీఎంసీ నుంచి తీసుకుంది. అయితే వాస్తవానికి అలా జరగలేదు. ఈ ప్రాంతానికి దగ్గరలోని జ్ఞానాపురం నుంచి ఉన్న రహదారి పోర్టు కంటైనర్ టెర్మినల్ వరకు వెళ్తుంది. పోర్టు అధికారులు ఆ రోడ్డును ఉపయోగించుకుంటే ఏ సమస్య ఉండేది కాదు. కానీ వారు ఆ రోడ్డును వదిలేసి జీవీఎంసీ రోడ్డును ఉపయోగించుకోవడం వల్ల రహదారికి పక్కన నివసిస్తున్న ఇళ్లు శిథిలమవుతున్నాయి.

భారీ వాహనాలు, కంటైనర్ ట్రాలర్స్ రాకపోకలతో పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో స్థానికులు కాలం వెళ్లదీస్తున్నారు. అంతే కాకుండా ఆ రోడ్డులో ఉన్న సెయింట్ అలోసియస్ స్కూల్ విద్యార్థులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని అంటున్నారు.

పొల్యూషన్ కోరల్లో..

ఈ ప్రాంతం కాలుష్యంతో కూడా బాధపడుతోంది. ఇక్కడ రోజుకు వెయ్యి నుంచి రెండు వేల వరకు వాహనాలు తిరుగుతుండడంతో కాలుష్యం అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. 20 వేల జనాభా ఉన్న ఈ వీధిలో ప్రతి ఇంటికి కనీసం ఒక్కరైనా కాలుష్య బాధితులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల వల్ల ఇక్కడి యూజీడీ కనెక్షన్లు సైతం శిథిలమై దుర్వాసన మధ్య జీవిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

సమస్య పరిష్కరించమంటే..

ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరితే ఆ రోడ్డు జీవీఎంసీకి సంబంధించిందని, వారినే అడగాలని చెబుతున్నట్లు స్థానికులు అంటున్నారు. అలా అయితే జీవీఎంసీ రోడ్డును పోర్టుట్రస్ట్ ఎలా ఉపయోగించుకుంటోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పోరాటం తీవ్రతరం చేస్తాం..



మేము పడుతున్న బాధలపై పోరాటం తీవ్రతరం చేస్తాం. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల సమస్య పరిష్కారం కాలేదు. కిందటి ఏడాది ఈ సమస్యపై మేము పోర్టు అధికారులతో మాట్లాడాం. ఒక్క సంవత్సరం గడువు ఇవ్వమని కోరారు. అయితే రెండేళ్లయినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై పోరాటం ఉధృతం చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకుంటాం.

–మహ్మద్ సాధిక్ , 39వ వార్డు కార్పొరేటర్.

నిద్ర లేని రాత్రుళ్లు గడుపుతున్నాం



నిత్యం వేలల్లో వాహనాలు తిరుగుతుండడం వల్ల మా ఇళ్లు కదులుతుంటాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో నిద్ర లేని రాత్రుళ్లు గడుపుతున్నాం. ప్రమాదాలు కూడా ఎక్కువ అవుతున్నాయి.

–పైడమ్మ, కోటవీధి.

పొల్యూషన్ నుంచి కాపాడండి..



పోర్టు వాహనాలు, పొల్యూషన్ నుంచి కాపాడండి. వీధిలో అందరూ వ్యాధులకు గురవుతున్నాం. దీనికి పరిష్కారం చూపించండి.

–చిన్నరాములు, కోటవీధి.

పొంగిన మ్యాన్‌హోల్‌తో ఇక్కట్లు

సీతమ్మధార : ఆశీలమెట్ట వద్ద మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరు రోడ్డు మీదకు చేరి మడుగులా తయారయింది. నగరంలో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట ఇలా జరుగుతున్నా జీవీఎంసీ యూజీడీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఆశీలమెట్ట ఫ్లైఓవర్ కింద సాయిరాం హోటల్ రోడ్డులో మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు చేరడంతో చెరువులా తయారయింది. దుర్వాసన వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు మొత్తం మురుగునీరు చేరడంతో విద్యార్థులు, పాదచారులు, ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ఆశీలమెట్ట ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ పొంగి చెరువును తలపిస్తున్న వైనం

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలకు పూర్వ విద్యార్థుల సహకారం



హెల్త్ యూనివర్శిటీ మాజీ వీసీ రవిరాజ్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యులు

మహారాణిపేట : శతాబ్ది ఉత్సవాలకు పూర్వ విద్యార్థులు ఎంతో సహకరిస్తున్నారని వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.రవిరాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్లో పూర్వ వైద్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వంద సంవత్సరాల చరిత్ర గల ఆంధ్రా మెడికల్ కాలేజీ ఈ ఏడాది శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. పూర్వ విద్యార్థుల పేరుతో భవన నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 58, 61 ఎంబీబీఎస్ విద్యార్థులు, సీనియర్ వైద్యులు పెదవీర్రాజు, పీవీ సుధాకర్, ఎస్‌కే అప్పారావు, రాధ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ

మహారాణిపేట: నారా లోకేష్ పాదయాత్రకు రోజురోజుకూ జనాదరణ పెరుగుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ బుద్దా వెంకన్న అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర విజయవంతంగా 100 రోజులు పూర్తయిందన్నారు. పాదయాత్రలో అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారన్నారు. చంద్రబాబు ఇంటిని ముట్టుకుంటే ఊరుకునేది లేదన్నారు.

డెంగ్యూతో అప్రమత్తం

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వ్యాధి పీడితులు
- అపారిశుధ్యంతో దోమల స్వైరవిహారం
- నేడు జాతీయ డెంగ్యూ దినోత్సవం

మహారాణిపేట: దోమల వల్ల సోకే వ్యాధుల్లో గెంగ్యూ ఒకటి. దోమకాటు ద్వారా 5 నుంచి 8 దినాల్లో డెంగ్యూ వాధి లక్షణాలు బయట పడతాయి. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరంతో పాటు తలనొప్పి, కంటి రెప్పల కదలికలు తగ్గడం, కదిలించినప్పుడు భరించలేని నొప్పి కలగడం, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై ఎర్రని దద్దుర్లు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం, శరీరంలోని వివిధ రంధ్రాల ద్వారా రక్తస్రావం జరుగుతుంది. ఈ రోగ లక్షణాలు అన్నీ ఉండకపోవచ్చు. ఇందులో కొన్ని లక్షణాలు మాత్రం వుంటాయి. డెంగ్యూ జ్వరం ఫ్లూ వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. ప్రతి ఏడాది మే 16న డెంగ్యూ జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి

డెంగ్యూ జ్వరంలో రోగికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయి. వాతావరణంలో మార్పు వల్ల, ఎక్కడ పడితే అక్కడ అపారిశుధ్యం పేరుకుపోవడం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీని వల్ల ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరం, చలి జ్వరం కలుగుతుంది. గత కొద్ది రోజులుగా కేజీహెచ్‌తో పాటు నగరంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగ్యూ జ్వర పీడితులు చేరుతున్నారు. ప్రస్తుతం 322 మంది డెంగ్యూ రోగులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మొత్తం 1964 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 322 మందికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. ప్రస్తుతం కేజీహెచ్ భావనగర్ వార్డులో వీరి కోసం ప్రత్యేకంగా కొన్ని మంచాలు సిద్ధం చేశారు. రోజు ఓపీకి 10 నుంచి 20 మంది జ్వరబాధితులు వస్తున్నారు. ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులు ఉంటున్నాయి.

డెంగ్యూకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు

అనేక ఆస్పత్రుల్లో డెంగ్యూ కేసులకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. 15 ఆస్పత్రుల్లో డెంగ్యూ కేసుల చికిత్స ఉచితంగా ఇస్తున్నట్టు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ రాజేష్ తెలిపారు. డెంగ్యూతో బాధపడుతున్న వారు ఏవరైనా ఉంటే తమను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

డెంగ్యూ కేసులకు చికిత్స ఇస్తున్నాం



డెంగ్యూ కేసులుంటే భయపడవలసిన అవసరం లేదు. చికిత్స కోసం కేజీహెచ్‌కు రావచ్చు. ప్రస్తుతం కేజీహెచ్‌లో డెంగ్యూ బాధితులకు చికిత్స అందుతోంది.

డాక్టర్ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్.

డెంగ్యూ వ్యాధి అదుపునకు పలు చర్యలు



ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. హెల్త్ సిబ్బంది ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా అవగాహన కలిప్తున్నారు. డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో దోమలను నాశనం చేయడానికి మందును పిచికారీ చేయడం, ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. డెంగ్యూను ప్రాథమికంగా గుర్తించే కిట్లు అందుబాటులో వుంచుతున్నాం.

డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి.

రిజిస్ట్రేషన్ల అమలుకు వినతి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై సర్వే నంబర్ 1450లో 2021 జూలై నుంచి ఆగిపోయిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు తిరిగి అమలు చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందన కార్యక్రమంలో విన్నవించారు. కలెక్టర్ మల్లికార్జున లేకపోవటంతో వచ్చే సోమవారం స్పందనలో మళ్లీ కలుస్తామన్నారు. వెంకటేశ్వరమెట్ట 1450 సర్వే నంబర్‌లో నివసిస్తున్న బాధితులతో కలిసి ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో అయినా రిజిస్ట్రేషన్లు అమలు పరుస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరీ సంఘం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్, కోశాధికారి కోరిబిల్లి త్రినాథ్, మహిళా అధ్యక్షురాలు కాండ్రేగుల మంగ, కొణతాల లీలావతి, విల్లూరి చిట్టి, సరగడం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో కలిసి సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన

మహారాణిపేట : వీసీటీపీఎల్ సహకారంతో సోమవారం హార్బర్ బీచ్ రోడ్డులోని గంగమ్మ ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మతో పాటు వీసీటీపీఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుదీప్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మందికి వైద్య సేవలందించారు. గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్

వివేకానంద సంస్థ ఉపాధ్యక్షుడు రాజు మృతి

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు దూడ రాజు సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో మంచం పట్టిన రాజు నగరంలోని ఏఎన్ బీచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్యోగం విషమించడంతో మృతి చెందారు. రాజు ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేశారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 104 ఎంఎంయూ వాహన సేవలు గతంలో వలె రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు 104 ఎంఎంయూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బి. తాతబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసిం, కోశాధికారి పి.ప్రకాష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి చేయాలి

మహారాణిపేట : ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ సోమవారం మత్స్యకార నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని, ఫ్లోటింగ్ జెట్టీలు వద్దని, ప్రస్తుతం ఉన్న జెట్టీల ఎత్తు పెంచాలని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మొదలైన మౌలిక వసతులు కల్పించాలని, కలాసీ డ్రైవర్లు వేటాడి తెచ్చిన చేపలు అమ్ముకోవడానికి ప్లాట్‌ఫారాలు, షెడ్లు నిర్మించాలని, డీపీఆర్ మార్పులు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు –మత్స్యకార కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ) విశాఖ జిల్లా అధ్యక్షుడు కర్రీ చంద్రశేఖర్, విశాఖ డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, విశాఖ కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

దాబాగార్డెన్స్: భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు తెలిపారు. వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం బహుళ ఏకాదశి సందర్భంగా భగవద్గీత శ్లోకాల సామూహిక పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి ఉపదేశించడం ద్వారా లభించిన భగవద్గీత విశిష్టతను తెలియజేసి సర్వ జనావళి గీతా సారాంశాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీమద్భగవద్గీత విశ్వ గ్రంథంగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

మహారాణిపేట : ప్రెస్ అక్రిడేషన్ల జీవోను సవరించి అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు జారీ చేయాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎంఏ)ప్రతినిధులు కోరారు. సోమవారం ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ జీవో వల్ల అనేక మంది జర్నలిస్టులు ప్రెస్ అక్రిడేషన్లు కోల్పోతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. కొత్త జీవోలో ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ జత చేయాలనే నిబంధన తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, ధవళేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బి. నారాయణరావు, కోశాధికారి రాజా అబ్బాస్, ప్రతినిధులు ఎస్. సన్యాసిరావు, కె.చక్రవర్తి, బీఏ నాయుడు, ఎం. శ్రీహరి, కె. అప్పలరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో నూతన ప్లాంట్ ప్రారంభం



త్రిబుల్ ఆర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

జగదాంబ: డంపింగ్ యార్డులో చెత్తను రీయూజ్ రెడ్యూస్ రీసైకిల్ (త్రిబుల్ ఆర్) ప్లాంట్‌ను నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. జీవీఎంసీ 39వ వార్డు డంపింగ్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగించే ఈ యంత్రం వలన ఎంతో ఉపయోగం ఉందన్నారు. సంప్రదాయ వ్యర్థాలకు ఈ కేంద్రం ప్రత్యామ్నాయం కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వ్యర్థాలను ఈ కేంద్రం ద్వారా రీసైకిల్ చేయవచ్చన్నారు. ముఖ్యంగా పాతనగరం వంటి ప్రాంతంలో పర్యావరణ నిర్వహణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం యంత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ సాధిక్, విల్లూరి భాస్కరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై సదస్సు నేడు



సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ప్రమాదాలు నిత్యకృత్యం అవుతున్నాయని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం సీఐటీయూ ఏపీ రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం10 గంటలకు రాష్ట్ర సదస్సు జరుగుతుందని అన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటన మరువక ముందే స్టీల్ ప్లాంట్, షిప్‌యార్డ్, ఫార్మా ఇండస్ట్రీస్ వంటి పరిశ్రమల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ, ఆడిట్, లేబర్ డిపార్ట్‌మెంట్ వంటివి తనిఖీలు చేయడం లేదని ఆరోపించారు. ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. ఈ సదస్సులో కార్మికులు, బాధిత కుటుంబాలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, పబ్లిక్ సెక్టార్ కో–ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కె.ఎం. కుమార్‌మంగళం, సీఐటీయూ నాయకులు వి.కృష్ణారావు, చంద్రమౌళి, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై చిన్నారులకు అవగాహన



మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగి



విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో మెలకువులు బోధిస్తున్న సూర్యనారాయణ

దాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగి ఎస్. జయలక్ష్మి ఇంట్లో పెరిగే మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కలిప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎల్. రాజేంద్రవర్మ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ

అల్లిపురం: ఇంగ్లీషులో మాట్లాడటంలో మెలకువలు నేర్చుకోవాలని రీసోర్స్‌పర్సన్ ఆర్. సూర్యనారాయణ విద్యార్థులకు సూచించారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల ఆంగ్ల ఉచ్ఛారణలో దోషాలను ఆయన సరిదిద్దారు. ఇంగ్లీషు మాట్లాడటం చాలా సులువని, ఏ విధంగా సులభంగా మాట్లాడాలో వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ విడుదల చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పివోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సేవా సంఘం నూతన కమిటీ నియామకం

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సమావేశం సోమవారం సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులను నియమించారు. అధ్యక్షుడిగా కొణతాల శ్రీనివాస్ (విశాఖపట్నం), సలహా కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ జడ్జ్ బి. రామారావు (శ్రీకాకుళం), రాష్ట్ర అధికార ప్రతినిధిగా బమ్మిడి గంగాధర్ (శ్రీకాకుళం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. రామకృష్ణ నాయుడు (శ్రీకాకుళం), కోశాధికారిగా ఎం. ఉమామహేశ్వరరావు(విశాఖపట్నం), రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆలేటి హేమలత (విశాఖపట్నం, సీహెచ్ వెంకటేశ్వరరావు(విశాఖపట్నం), సనపల అన్నాజీరావు (శ్రీకాకుళం), జి. అప్పలనాయుడు (విజయనగరం), ఎం. ఎల్లారావు(అనకాపల్లి), అదనపు ప్రధాన కార్యదర్శులుగా కోటా రమేష్, కె. మధుసూదన్, రాఘవకుమార్, జి. వెంకట్రావు, కార్యదర్శులుగా కొప్పుల రామ్‌కుమార్, సన్యాసినాయుడు, జె. భాస్కర్, కె. అప్పలనరసమ్మ, సహాయ కార్యదర్శులుగా కొయ్య రామకృష్ణ, అప్పలరాజు, శ్రీనివాస్, కృష్ణారావు, అప్పన్న, పలువురు నిర్వహణ కార్యదర్శులు, సహాయక కోశాధికారి, సలహా కమిటీ సభ్యులను నియమించారు.

పరదేశమ్మ పండగ నేడు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ పరిధిలోని పరదేశమ్మ పండగ మంగళవారం జరుగనుంది. ఈ సందర్భంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు దొండపర్తి నుంచి అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. మంగళవారం ప్రధాన పండగ, ఈ నెల 23న మరువారం సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి అనిల్‌భవాని ఆధ్వర్యంలో మహిళలచే అమ్మవారికి సారె సమర్పించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. పరదేశమ్మ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.



తొలేళ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు